రజిత నవ్వుతూ అంది: "ఎవరికైనా డబ్బులు ఎక్కడి నుంచి వస్తాయి?"

నే నేమీ అనలేదు. రజిత అడిగిన ప్రశ్నకు జవాబు నాకు తెలీదు. ఆ ప్రశ్నకు జవాబు తెలిసి ఉంటే నేను ఇలా ఉండే వాణ్ణే కాను. డబ్బులు ఎక్కడి నుంచి వస్తాయో, ఖచ్చితంగా అక్కడే ఉండే వాణ్ణి.

క్షణం ఆగి రజితే అంది: "మిగతా అందరి సంగతీ తెలీదుగానీ, నాకు మాత్రం నా డబ్బులన్నీ కష్టార్జితం!"

"అంటే మిగతా అందరూ దోచుకొంటున్నారనా నీ ఊహ?" అన్నాను నేను.

నవ్వింది రజిత: "దోచుకొంటున్నారో, కోసుకొంటున్నారో నే నెరగను! నేను చెప్పేదంతా నా సంగతే!"

రజిత పేరు రజితబాల. నా కెంత మందో అమ్మాయిలు తెలుసు. కానీ, వాళ్ళెవరికీ ఇంత అందమైన పేరు లేదు. అందరికీ లక్ష్మి, శ్యామల, మబ్బులు, రాధ, కమల, విమల. . . ఇంతేగానీ ఇంత అందంగా 'రజితబాల' అన్న పేరున్న ఆడ వాళ్ళెవరూ నాకు కనపడలేదు.

రజితలో అందం అంతా పేరులోనే అయిపోలేదు. పేరు దగ్గరే మొదలైంది. రజిత అందంకూడా అలాటిదే. అంత అందమైన అమ్మాయిని నేను చూడ లేదు. నవ్వగా, కొంచెం పొడుగ్గా ఉంటుంది రజిత. శరీరంలో ఏ భాగం ఎక్కడ ఉంటే బాగుంటుందో, ఏ భాగం ఏ ఒంపు తిరిగితే అందంగా ఉంటుందో అంత ఖచ్చితంగా ఇంకెవరూ నిర్ణయించ లేరు. రజితతో స్నేహం కోసం కొన్నాళ్ళు నేనూ అవస్థ పడ్డ మాట వాస్తవం. ఆ అందాలరాశితో క్షణం గడిపితే నా జన్మ సార్థకం అని అనుకున్న మాటా అక్షరాలా నిజం!

కొందరు ఆడవాళ్ళు ఎందుకు బ్రతుకుతారో వాళ్ళకే తెలీదు. వాళ్ళు తమలోని అందచందాలన్నీ ఎన్ని రకాలుగా నాశనం చెయ్యగలరో అన్ని రకాలుగానూ చేయటం నాకు తెలుసు. ఇలాటి తెగకు వ్యతిరేకంగా కొందరు తమలో లేని అందాలను అవస్థ పడి తెచ్చుకో యత్నించటమూ నిజం. రజిత ఈ రెండు తెగలకూ చెందని స్త్రీ. ఆమెకు దేవుడిచ్చిన వరాలు ఉండనే ఉన్నాయి. ఆ అందచందాలన్నిటినీ ఎంత జాగ్రత్తగా కాపాడుకొంటుందో నాకు తెలీదు. కానీ, ఆ అందచందాలన్నిటికీ మెరుగులు దిద్దటం మాత్రం నాకు తెలుస్తూనే ఉంది.

**భక్తి**

**భక్తితో తల వంచినవానికి అన్నీ పవిత్రంగానే కని పిస్తాయి.**

**— పెరాన్స్**

**జీవనంకోసం జరిపే పోరాటమే నిజమైన విద్య.**

**— వెండెల్ ఫిలిప్స్**

ఆ రోజున రజిత ఆ చీర కట్టుకోకుండా వచ్చి ఉంటే ఇంత గొడవ జరిగేదే కాదు.

తెల్లటి పాలసముద్రం లాటి చీర. పాలసముద్రంలో అమృతపు నురగలుగా అక్కడక్కడ చిన్న చిన్న చుక్కలు.

ఇంతే ఆ చీర! నిరాడంబరంగా ఉంది.

ఆ చీరతో నాకు బాగా పరిచయం ఉంది. రజిత కన్నా ముందు ఆ చీరను నేను ఎరుగుదును!

ఆఫీసు కొస్తున్న దారిలో ఎన్నో బట్టల కొట్లు. సీతాకోకచిలుకలన్నీ రోజు కో రకంగా తయారయి వస్తున్నట్లుగా ఆ బట్టలకొట్ల బయట చీరల ఊరేగింపు.

పేవ్‌మెంట్ మీద నడుస్తూంటే ఒక్కో చీర గాలికి కదిలి, నెమ్మదిగా పైకి లేచి ఆహ్వానం పలుకుతూ ఉండేది.

ఈ రంగుల పరదాలోంచి రోజూ ఈదుకొంటూ, చీరల అందాలన్నీ ఆస్వాదిస్తూ వస్తూ ఉండే నాకు ఆ చీర నాకు బాగా పరిచయం. అన్ని చీరల లోనూ నన్ను అమితంగా ఆకర్షించింది ఆ చీరే!

అప్రయత్నంగా లోపలికి వెళ్ళి అడిగాను ఆ చీర ధర ఎంత అని.

ఆ షాపు ఓనర్ వెంటనే ఓ సేల్స్‌మన్‌ని పిలిచాడు. వచ్చిన వేంటనే ఆ చీరను దింపించాడు. చీర కిందకు దిగిందే కానీ, ధర దిగలేదు.

మూటపాతిక రూపాయలు!

ఆశ్చర్యంగా ఒకసారి ఆ చీరను ముట్టుకొన్నాను. పాలసముద్రం మీది నురగ ఇంతకన్నా మన్నితంగా ఉంటుందా? నాకు తెలిసి వాటిని ఊహించుకొని కళ్ళ ముందున్న అందాన్ని అపహసించటం దారుణం.

ఆ చీర కొంటే. . .

ఉమ పురిటికి వెళ్ళి నెల దాటింది. బహుశా ఈ రోజో, రేపో పురుడుకూడా వస్తుందేమో. ఇంటినుంటి టెలిగ్రామ్ వస్తే, మా ఇంటి సామ్రాజ్యానికి వారసుడో, వారసురాలో. . . ఎవరో ఒకరు. . . వారికి స్వాగతం పలకటం కోసం బహుశా వెళ్ళవలసే ఉంటుంది. ఉమ నాతోబాటు సుఖాలన్నీ పంచుకున్నా గానీ, ఉమతో ఈ కష్టం నేను పంచుకో లేనిది. అందుకే నా కష్టాన్ని ఇంతకాలం భరించినందుకు ఉమకు బహుమతిగా కృతజ్ఞతతో ఈ చీర ఇస్తే. . .

ఈ చీర నెలలోపిదే అవుతుంది.

కానీ...మూటపాతిక రూపాయలు!

ఒకటి. . . రెండు. . . మూడు. . .

అబ్బో, మూటపాతిక చాల దూరం!

ఇదంతా ఒకసారి మనసులో మెదిలింది. కొనలేని ఆ చీరను మరోసారి ఆప్యాయంగా తడిమి, ప్రేమతో నిమిరి, ఈ చీర కట్టబోయే ఆ చిన్నారిని ఒకసారి తలుచుకొని, మెట్లు దిగాను.

ఆ తరవాత ... ఈ రోజున రజిత అందాలన్నిటినీ ముట్టుకొంటూ నా అభిమానపైన చీర!

నేను చేయలేని పని నా చీర చేయటం నాకు రవంత అసూయగా ఉంది. రజితను ఆప్యాయంగా తాకుతూ, ఆదరణగా చుట్టుకొంటూ. . . ఓ చీరా, ఎంత అదృష్టవంతురాలివి!

చాలా సేపు రజిత కేసే చూశాను.

రజిత ఈ చీరలో అందంగా ఉంది.

పాలసముద్రం చీర. నురగల్లాటి చుక్కలు. మోహినిలా రజిత. ఎంత అందంగా ఉంది!

**పాలకోడేటి సత్యనారాయణరావు**

నేను అలాగే అపర్యంగా రజితకేసే చూస్తూ ఉండిపోయాను. ఈ చీరలో ఉమ ఉండవలసింది. కానీ, రజిత ఉంది.

ఉమ ఈ చీరలో అందంగా ఉండేది కాదు. నెలలు నిండిన పొట్టతో...ఛీ ... చీర అందం నాశనమయి ఉండేది.

రజిత రక్షించింది. ఈ చీరకు ఇంత అందం ప్రసాదించింది.

రజిత నా పక్కకు వచ్చి కూర్చుంటూ అంది: "ఏమిటి, ఇందాకట్నుంచీ అలా చూస్తున్నావు?"

ఏం చెప్పను?

"ఈ చీర నేను కొందామని అను కొన్నాను!" నిజం చెప్పేశాను.

నవ్వింది రజిత.

"మరి కొనలేదేం?"

"చీరతనం!"

మరింతగా నవ్వింది రజిత.

"చీరతకం అని చెప్పటంలో నిజం ఉంది. ధైర్యం ఉంది. అంతేగానీ, నవ్వటాని కేముంది ఇందులో?" అన్నాను నేను.

"ఛీ! ఆ ఉద్దేశంతో కాదు నేను నవ్వింది!" నొచ్చుకుంటూ అంది రజిత. "నువ్వు అంటున్న పద్ధతి నిజం అని అనిపించేలా లేదు!"

"కాబోలు!" అన్నాను నేను. "అయినా, రజితా, ఒక్క మాట. ఇన్ని డబ్బులు ఎక్కడినుంచి వస్తాయి?" అని అడిగాను.

"మిగతా అందరి సంగతి ఏమోగానీ, నా డబ్బులన్నీ కష్టార్జితం!"

"అంటే, మిగతా అందరూ దోచు కొంటున్నారనా?"

"దోచుకొంటున్నారో, కోసుకొంటున్నారో నే నెరగను! నేను చెప్పేది అంతా నా సంగతే!" రజిత చాలా సేపు ఊరకుండిపోయింది. చివర్న నెమ్మదిగా అంది: "నీతో నిజం చెబుతున్నాను— నేను ఆడదాన్ని కదా! నా సంపాదన అంతా నా కష్టార్జితం కాబట్టి నేనే ఖర్చు పెట్టు కొంటాను."

"అంటే?"

"అంటే ఏముందీ? ఇంట్లో ఖర్చు సంగతి ఇంట్లోని మగవాళ్ళ బాధ్యత. నేను సంపాదించేది అంతా నా కోసమే ఖర్చు పెట్టుకుంటున్నాను!"

'అదృష్టవంతురాలు!' అనుకొన్నాను నేను.

ఉన్నట్లుండి అంది రజిత: "నువ్వు ఈ చీర కొందామనుకున్నది నిజమేనా?"

తల ఊపాను నేను, నిజమే నన్నట్లుగా.

"అయితే, ఒక పని చెయ్యి నీ కభ్యంతరం లేకపోతే. . . లేకపోతేనే సుమా! రేపు ఈ చీర తీసుకొస్తాను. నువ్వు తీసుకో!



# లోహితాసదుర్గం



లోహితాస పర్వతంపై ఈ కోట ఉంది. హరిశ్చంద్రుని కుమారుడు లోహితాస్యుని పేర దీనికి పేరు వచ్చింది. ఈ కోట 28 మైళ్ళ వరకు వ్యాపించి ఉంది. కోటకు మూడు వైపుల పర్వత పంక్తులు, నాల్గో పక్క సోనసది ఉన్నందున ఇది దుర్గమము, దుర్భేద్యం అయింది. నాలుగు ప్రధాన ద్వారాల వద్ద ఎల్ల వేళలా జాగరూకులైన సాయుధ భటులు ఉంటారు.

15 వందల అడుగుల ఎత్తులో ఈ కోట విటారుగా ఉంటుంది. కోటలో ఉన్న మహల్‌సరాయ్ రాజా మానసింహ నిర్మించాడు. ప్రవేశద్వారానికి ఇరువైపులా ఏనుగు విగ్రహాలు రెండు ఉన్నాయి. కోటలో పర్వాకార స్తంభాల రెండంతస్తుల భవనం ఉంది. తరవాత రంగుమహల్, పూలతోట. ఆ తరవాత రెండంతస్తుల అద్దాల మేడ ఉంది. ఇందులో చాలా దేవాలయాలు ఉండేవి.

1537 ప్రాంతంలో షెర్షాకి, హుమయూన్‌కి మధ్య జరిగే సంఘర్షణలో షెర్షా అభ్యర్థన మన్నించి ఈ దుర్గ పాలకుడు షెర్షా స్త్రీలకి శరణు ఇచ్చాడు. కాని, పల్లకీలలో స్త్రీలకి బదులు సాయుధ సైనికులు వచ్చి కోటని ధ్వంసం చేశారు.

1576 లో ఈ కోట అక్బరు అధికారంలోకి వచ్చింది. 1587 లో తిరిగి రాజా మానసింహ దీన్ని హస్తగతం చేసుకున్నాడు. ఈ కోటని అభివృద్ధిలోకి తీసుకు వచ్చాడు. తరవాత మొగలులు దీన్ని వశపరుచుకున్నారు. 1764 లో బక్సార్ యుద్ధంలో మీర్‌ఖాసిమ్ ఓడిపోయాడు. ఫలితంగా ఈ దుర్గం ఆంగ్లేయుల చేతిలోకి పోయింది.

1857 లో జగదీశ్‌పూర్ వీరుడు కుంవర్‌సింహ తమ్ముడు అమరసింహ ఈ దుర్గాన్ని తన కేంద్రంగా చేసుకుని ఆంగ్లేయుల్ని ఎదిరించాడు.

ఈ కోటలో లోహితాస ఇంద్రస్థిని స్థాపించిన తరవాత పూర్వపు వైభవంతో అలరారసాగింది.

రచన :
**కాలిపు వీరభద్రుడు**
చిత్రం:
**కాలిపు సోమరాజు**

---

డబ్బు నీకు ఎప్పుడు వీలైతే అప్పుడే ఇవ్వవు గానీలే!"

రజిత అన్న మాటలు నాలో కొన్ని కొత్త ఆలోచనలు లేపాయి. ఈ పద్ధతి బాగానే ఉంది. చీర కొన్నట్టుగానూ ఉంటుంది. పర్సుకు కష్టమూ రాదు. కానీ, ఈ చీర రజిత ఇప్పటికే కట్టుకొని ఉంది. కొత్త చీర అని తీసుకువెళ్ళి ఉమకు ఇవ్వటం ఎంతవరకు సమంజసం? నా మనసులో ఆలోచనలు పసిగట్టినట్లుగా నవ్వుతూ అంది రజిత: "ఏమిటి ఆలోచిస్తున్నావు? ఈ చీర కడితే మీ ఆవిడ కుదిస్తుందా? లేకపోతే నేనే కుదిస్తానా?"

ఉలికిపడ్డాను.

కూడదు! ఆడదానికి ఇంత తెలివి పనికిరాదు. నా మనసులో ఉన్న ఆలోచనల్ని ఇంత దారుణంగా ఎలా పసిగట్ట గలుగుతూంది? రజిత అందమైనదే కాదు, తెలివైనది కూడాను! కానీ, తెలివైన ఆడదాన్ని భరించటం కొంచెం కష్టం.

నవ్వేశాను నేను. జవాబుగా రజిత నవ్వుతూంది. పాలసముద్రం లాటి చీర. అమృతపు మరకలాటి చుక్కలు. చందమామ లాటి రజిత. విరిసిన వెన్నెల లాటి నవ్వు! ఎంత అదృష్టవంతుడో ఆ వ్యక్తి. . .! లీలగా అసూయ కలిగింది నాకు.

ఇంటికొచ్చాను. ఇంటి కొచ్చి తలుపు తీసేసరికి ఉమ దగ్గరనుండి ఉత్తరం. 'నిన్ననే డాక్టరు దగ్గరకు వెళ్ళాను. ఇంకో నాలుగైదు రోజులైనా పడుతుందని చెప్పింది. టెలిగ్రామ్ అందగానే రాకపోతే నా మీద ఒట్టే!' అంటూ రాసింది. 'వేళకు వంట చేసుకొని, తప్పకుండా రెండు పూటలా తింటూ ఉండ'మనీ ఇంకా మరెన్నో ఉచిత సలహాలు—వీటన్నిటితో బాటుగా చివర్న. . .

ఉమ నన్ను ఇంత ఇబ్బంది పెట్టటం అమానుషంగా ఉంది. ఎప్పుడో ఇంట్లో యువరాజెవరో నడయాడుతూంటే, అందంగా ఆనందించే రోజులుంటే బాగానే ఉంటుంది కానీ, ఈ రోజున, ఈ క్షణంలో ఈ బాధ. . .

'ఏమిటో ఉమా! అన్నంతా నీదే!' అనుకొన్నాను.

వెన్నెకలా పడుకుంటే, గదిలో గోడకున్న కాలెండర్లోంచి అందాల రాణులన్నీ నగ్నంగా ఆహ్వానిస్తున్నాయి.

కోరికలు కోసేస్తున్న ఈ క్షణంలో ఈ ఆహ్వానం ఒకటి!

అశాంతితో బయటకు నడిచాను.

కృష్ణపక్షపు మసక వెన్నెల. అడుగులో అడుగు వేసుకుంటూ, అనాలోచితంగా, అయోమయంగా నడుస్తున్నాను.

బజారులోకి వచ్చాక. . . ఆ బోర్డు నాకు చిరపరిచితం. ఇదే లాడ్జిలో ఇదివరకోసారి. . .

మెల్లిగా హోటల్ మెట్లెక్కి, మలుపు తిరిగి, ఆ హాలులోకి వెళ్ళాను. ఎదురొచ్చిన బేరర్ నవ్వాడు.

నా కోరిక నా ప్రవర్తనలోనే తెలుస్తూంది.

"రండి, సార్!" అంటూ లోపలికి తీసుకెళ్ళాడా బేరర్.

రక్తం క్షణక్షణం ఉలికి పడుతూంది. రక్తనాళాలన్నీ క్షణంలో తెగి ఊడిపోతాయా అన్నట్లుగా ఉంది.

ముందుకు నడుస్తూనే ఉన్నాను.

గది తలుపు తీసి మెల్లిగా లైటు స్విచ్ వేశాడు.

అంతవరకు గదిలో ఉన్న వ్యక్తి లేచి నిలబడింది.

పాలసముద్రం చీర, అమృతపు మరక లాటి చుక్కలు—ఇవన్నీ అందంగా, ఆప్యాయంగా చుట్టుకొన్న రజిత.

నా తల తిరిగిపోయింది.

ఇలాటి చీర ఉమ కట్టదు, కట్టలేదు. నా ఉమకు పాలసముద్రం చీర అక్కర్లేదు. అమృతపు మరక లాటి చుక్కల చీరా అక్కరలేదు. నేను ఇంటికి తీసుకెళ్ళగలిగే పచ్చ అంచు గళ్ళచీరే నా ఉమకు చాలు!

'నా సంపాదన అంతా నా కష్టార్జితం!' రజిత అన్న మాటలలో నాకు కొత్త అర్థాలు కనిపిస్తూంటే, పరుగు పరుగున మెట్లు దిగాను. . . ★